

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు

పలాస రూరల్, ఫిబ్రవరి 17: విద్యాహక్కు చట్టం కింద 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ నెల 23 నుంచి మార్చి 14 లోగా అర్హులైన విద్యార్థులు సీఎస్‌ఇ.ఏపీ.గవర్నమెంట్.ఇన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు డీఈవో, ఎంఈవోలను సంప్రదించాలని కోరారు.

సీఎం హామీ ఇచ్చినా.. అంతే

● వంశధార ప్రధాన ఎడమ కాలువ, మదనగోపాలసాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పై అంచున డీటూరింగ్ కాలువ నిర్మిస్తాం. రూ.8.30 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణానికి చర్యలు చేపడతాం.

- ఇదీ గతేడాది డిసెంబరు 14న పలాస కిడ్నీ ఆస్పత్రి ప్రారంభోత్సవం సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీ.

- ప్రతిపాదనల్లోనే డీటూరింగ్ కాలువ
- ఫైనాన్స్ అనుమతుల పేరిట జాప్యం
- శివారు ప్రాంత రైతుల్లో నిరాశ



మదనగోపాలసాగరం జలాశయం

(టెక్కలి)

డీటూరింగ్ కాలువ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. దీని నిర్మాణానికి గతేడాది డిసెంబరులో పలాస వచ్చిన సందర్భంగా సీఎం జగన్ హామీ ఇచ్చారు. దీంతో టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల రైతుల్లో ఆశలు రేకెత్తాయి. కాగా.. ఇంతవరకూ ఇది కార్యరూపం దాల్చకపోవడంతో శివారు ప్రాంత రైతులకు నిరాశే మిగులుతోంది. ప్రజాప్రతినిధుల్ని, అధికారులను ఎవర్ని అడిగా ఫైనాన్స్ అనుమతుల వద్ద పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. కొద్దిరోజుల్లో సార్వత్రిక ఎన్నికల కోడ్ వెలువడనుంది. ఈ నేపథ్యంలో సీఎం హామీ గాలిలో కలిసిపోయే అవకాశం ఉందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

● డీటూరింగ్ అంటే..

వంశధార ప్రధాన ఎడమకాలువ ద్వారా వచ్చే సాగునీరు.. టెక్కలి సమీపంలోని మదనగోపాలసాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(0.2 టీఎంసీ కెపాసిటీ) నిండిన తరువాతే శివారు ప్రాంతాలకు చేరుతోంది. మదనగోపాలసాగరం జలాశయం నిండాలంటే కనీసం పదిరోజులు పడుతుంది. అందుకే మదనగోపాలసాగరం జలాశయం పైఅంచున 50 కిలోమీటరు మొదలుకుని 51.5 కిలోమీటర్ల వరకు నేరుగా కాలువ తవ్వి.. వంశధార సాగునీటిని ఆ కాలువ వెంబడి శివారు ప్రాంతాలకు ముందుగా పంపించేందుకు ప్రతిపాదన చేశారు. దీనివల్ల టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 42వేల ఎకరాలకు సకాలంలో సాగునీరు అందుతుంది. అప్పటి నీటిపారుదల శాఖ ఎస్‌ఈ ఐఎస్ఎన్ రాజు ఈ ప్రతిపాదనకు శ్రీకారం చుట్టారు. శివారు ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు 2019లో రూ.8.30కోట్ల అంచనా వ్యయంతో వంశధార ఇంజనీరింగ్ అధికారులు దీన్ని ముందుకు తీసుకువెళ్లినా.. నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రస్తుత పరిస్థితి..

సీఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన తర్వాత డీటూరింగ్ పనుల కుగాను రూ.8.30కోట్ల ఫైనాన్స్ ఆమోదమంటూ నెలలు తరబడి మూలుగుతోంది. ఫైనాన్స్ ఆమోదం లభిస్తే తప్ప.. పరిపాలనా అనుమతులు లభించవు. ఈ రెండూ లభించిన తరువాత మరోసారి సాంకేతిక అనుమతులు పొందాలి. అప్పుడే టెండర్ స్థాయికి వెళ్లే అవకాశాలుంటాయి. ఆ తర్వాతే క్షేత్రస్థాయిలో పనులు సాగుతాయి. ఎన్నికల కోడ్ వచ్చేలోగా ఇవన్నీ సాధ్యమయ్యే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ కొత్తకోట శ్రీకాంత్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా డీటూరింగ్ కాలువకు ఫైనాన్స్ అనుమతి పెండింగ్‌లో ఉందని తెలిపారు.



డీటూరింగ్ కాలువ మ్యాప్



టెక్కలి సమీపంలో వంశధార ప్రధాన ఎడమకాలువ

రైతులపై ఇంత నిర్లక్ష్యమా?

- నిలిచిన నదుల అనుసంధానం
- పూర్తికాని హెచ్ఎల్‌సీ నిర్మాణ పనులు
- సాగునీటి కోసం తప్పని ఇబ్బందులు



వెన్నెలవలస వద్ద హెచ్ఎల్‌సీ ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న చంద్రబాబు (ఫైల్)

(సరుబుజ్జిలి)

వైసీపీ ప్రభుత్వం తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు పుష్కలంగా సాగునీరు అందించాలనే ఉద్దేశంతో టీడీపీ హయాంలో వంశధార, నాగావళి నదులు అనుసంధానం చేయాలని అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. 2017-18లో వంశధార కుడికాలువ పరిధిలో సుమారు రూ.145కోట్లతో 600 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉన్న దాదాపు 34 కిలోమీటర్ల హైలెవెల్ కెనాల్ (హెచ్ఎల్‌సీ) నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పీవీఆర్ సంస్థ 60 శాతం పనులు పూర్తి చేసింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారి.. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచీ వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో హిరమండలం, లక్ష్మీనర్సుపేట, సరుబుజ్జిలి, బూర్జ మండ లాల రైతులకు వంశధార కుడికాలువ నుంచి సాగునీటి సరఫరా కలగానే మిగులుతోంది. ఈ హెచ్ఎల్‌సీ నిర్మాణానికి సుమారు 637 ఎకరాలు అవసరం కాగా, అధికారులు 597 ఎకరాలు భూసేకరణ చేపట్టారు. శ్రీరాంవలస, చిగురువలస, లక్ష్మీపురం, బొత్తాడసింగి, డకరవలస, అమృత లింగానగరం గ్రామాలకు చెందిన రైతులకు సుమారు 34 ఎకరాలకు సంబంధించి రూ.6.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. దేవదాయశాఖకు చెందిన 5.51 ఎకరాల భూముల సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో కాలువలో రెల్లిగడ్డి, పూడికలు పేరుకుపోయాయి.

● వంశధార కాలువపై 66 నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 34 పూర్తయ్యాయి. మరో 23 వివిధ దశల్లో ఉన్నాయి. ఏడు పనుల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. వివిధ దశల్లో ఉన్న కాంక్రీట్ పనుల వద్ద ఏర్పాటు చేసిన ఇనుపగజాలు నీటిలో నానుతూ తుప్పుపడుతున్నాయి. కొన్నాళ్ల కిందట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద హెచ్ఎల్‌సీ నిర్మాణంలో భాగంగా నిలిచిన అండర్ టన్నెల్ పరిస్థితిని పరిశీలించారు. సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

● హెచ్ఎల్‌సీ నిర్మాణ పనుల విషయమై వంశధార అధికారుల వద్ద ప్రస్తావించగా.. ఇప్పటివరకు 80శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇటీవల కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించామన్నారు. భూసేకరణ విషయంలో రైతుల సమస్యలు పరిష్కరించి వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేందుకు ప్రయత్నస్తున్నట్టు తెలిపారు.



వెన్నెలవలస వద్ద హెచ్ఎల్‌సీ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తుప్పుపడుతున్న గజాలు

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 17: సిక్కోలును మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సభ్యులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో మాదకద్రవ్యాల వాడకాన్ని, రవాణాను అరికట్టేందుకు పకడ్బందీగా ప్రణాళిక రూపొందించాలి. వీటిబారిన పడితే కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో డి-అడిక్షన్ సెంటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ జిల్లాలో ఆరు చెక్‌పోస్టులతో పాటు నిరంతరం పెట్రోలింగ్ టీమ్‌తో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. గడిచిన ఆరు నెలల్లో 110 కిలోల గంజాయిని అక్రమ రవాణా అడ్డుకుని.. 14 మందిని వేర్వేరు కేసుల్లో పట్టుకున్నామన్నారు. సమావేశంలో జేసీ ఎం.నవీన్, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, అటవీశాఖ, డ్రగ్స్ కంట్రోల్ అధికారి, విద్యాశాఖ, పోలీసు ఇన్‌స్పెక్టర్లు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

మూలపేట పోర్టు రైల్వేట్రాక్‌కు భూసేకరణ

కలెక్టరేట్: మూలపేటపోర్టు నిర్మాణంలో భాగంగా రైల్వేటాక్‌కు అవసరమైన భూ సేకరణ చేపట్టనున్నట్టు కలెక్టర్ కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ నవీన్, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్‌తో కలిసి రైల్వేట్రాక్‌కు అవసరమైన భూసేకరణకు సంబంధించి కూర్మనాథపురం, యామాలపేట, పోతునాయుడు పేట, కోటపాడు, కాశీపురం, రాజపురం గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోర్టు, రోడ్డులకు భూసేకరణ చేశామన్నారు. భూసేకరణ చట్టం నిబంధనలకు మించి పరిహారం ఇస్తున్నట్టు తెలిపారు. జేసీ నవీన్ మాట్లాడుతూ.. ఆరు గ్రామాల నుంచి 72 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. పోతునాయుడుపేట సర్పంచ్, మిగిలిన గ్రామాల రైతులు మాట్లాడుతూ.. గ్రామాల్లోకి నీరు రాకుండా చూడాలని కోరగా, ఏ విధమైన నష్టం లేకుండా చూస్తామని, మరోసారి సమస్యలపై చర్చిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి అరెస్టు

- సొంత పార్టీ నాయకుడిపైనే హత్యాయత్నం
- కాస్త ఆలస్యమైనా.. స్పందించిన పోలీసులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సొంత పార్టీ నాయకుడిపైనే హత్యాయత్నం కేసులో వైసీపీకి చెందిన కీలక నేత అరెస్ట్ అయ్యారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఈనెల 9న రాత్రి వైసీపీ నాయకుడు, ఎచ్చెర్ల వైస్ ఎంపీపీ భర్త జరుగుళ్ల శంకరరావుపై ఇద్దరు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేసి హత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో శంకరరావుకు తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యవహారంలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవితోపాటు మరికొందరి ప్రమేయం ఉందని శంకరరావు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దాడి ఘటనను నిరసిస్తూ వెలమ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ప్రజలు, రాజకీయాలకు అతీతంగా ఇతర పార్టీ నాయకులు కూడా పాల్గొని ఇటీవల శ్రీకాకుళంలో భారీ ర్యాలీ చేపట్టారు. నిందితులను పట్టుకుని శిక్షించాలని, శంకరరావుకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు శంకరరావు సతీమణి, ఎచ్చెర్ల వైస్ ఎంపీపీ విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరరావును రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పరామర్శించగా.. తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ క్రమంలో పోలీసులపై ఒత్తిడి పెరిగింది. ముందుగా సీఆర్పీసీ ప్రకారం నోటీసు ఇచ్చి.. ఆపై విచారణ చేపట్టారు. నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరించే ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిని శనివారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. కొద్ది రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైసీపీలో వర్గపోరు రాష్ట్రంలో ఎక్కడాలేనంతగా ప్రబలిపోయింది. అయితే ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి న్యాయవాది. ఆపై అధికార పార్టీ కీలకనేత కావడంతో ఆయనను అరెస్ట్ చేసే విషయంలో పోలీసులు ఆలస్యం చేశారు.

● ఏడాదిన్నర కిందట శ్రీకాకుళం నగరానికి చెందిన వైశ్య సామాజిక వర్గానికి చెందిన ఓ యువకుడ్ని కిడ్నాప్ చేసి దాడి చేశారు. ఖాళీ స్టాంపుపత్రాలపై సంతకాలు తీసుకున్నారు. దీనికి సంబంధించి అప్పట్లో శ్రీకాకుళం వన్‌టౌన్ స్టేషన్‌లో బాధిత యువకుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవిపై కేసు నమోదైంది. కానీ అప్పటి పోలీసులు ఈ కేసు విషయంలో వెనకడుగేశారు. ఆ తర్వాత కేసు వివరాలను పోలీసులు సైతం వెల్లడించలేదు. ఇప్పుడు వైసీపీ ద్వితీయస్థాయి నాయకుడు, వైస్ ఎంపీపీ భర్తపై దాడి ఘటనలో చిరంజీవిపై ఆరోపణలు రావడంతో పోలీసులు తప్పనిసరిగా స్పందించాల్సి వచ్చింది. కాస్త ఆలస్యమైనా ఎట్టకేలకు ఆయనను అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసే సమయంలో కొంతమేర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. 'గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదు చేస్తే.. పోలీసులు నన్ను అరెస్టు చేశారు. నేను ఎంపీపీగా భూ దందాలు, అక్రమాలను అడ్డుకోవడం వల్ల నాపై కుట్రపన్నారు' అని ఎంపీపీ చిరంజీవి ఆరోపించారు. పోలీసులు డౌన్‌డౌన్ అంటూ ఎంపీపీ అనుచరులు నినాదాలు చేశారు.



ఎంపీపీ చిరంజీవిని అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న జేఆర్‌పురం సీఐ రామచంద్రరావు

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమమే

● ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం

కలెక్టరేట్, ఫిబ్రవరి 17: 'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిపై ఉద్యోగవర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. ఇంకా మా సహనాన్ని పరీక్షించాలనుకుంటే ఉద్యమించక తప్పదు' అని ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమీపంలో పూలే పార్కు వద్ద ఎన్జీవో శ్రీకాకుళం పట్టణ శాఖ నిర్వహించిన ధర్నా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను ఐదేళ్లుగా ఖాతాలో జమ చేయలేదు. పీఆర్సీలో కూడా ఉద్యోగులకు అన్యాయం చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు 25వేల కోట్లకు పైమాటే. ఉద్యోగులు లోన్ పెట్టుకున్నా.. సమయానికి డబ్బులు అందడం లేదన్నారు. బీమా డబ్బులు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల జీపీఎఫ్ కూడా చెల్లించకపోవడం దారుణం. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఆరు నెలలకు కొత్త డీఏ ప్రకటించగా.. రాష్ట్ర ప్రభుత్వం కనీసం పాత డీఏలు కూడా చెల్లించకపోవడం శోచనీయం. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. లేదంటే ఆందోళన బాట పడతామ'ని హెచ్చరించారు. జేఏసీ నాయకులు కిషోర్‌కుమార్, టెంక చలపతిరావు, పార్వతీశం, ఆదినారాయణ హాజరై మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో ప్రతినిధులు బొత్స శ్రీను, పూజారి జానకిరామ్, గోవింద్ శశిభూషణరావు, ఏ.వెంకటరమణ, బీవీ రమణ, రోజాకుమారి, మమత, లక్ష్మీ, మధు, కె.లక్ష్మణరావు, డి.అప్పన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమంతు సాయిరాం





వేణుగోపాలస్వామి ఆలయంలో క్యూలైన్లకు ఏర్పాట్లు..

శ్వేతగిరి యాత్రకు వేళాయే

● 20న వేణుగోపాలస్వామి జాతర

(గార)

శ్వేతగిరి యాత్రకు రంగం సిద్ధమైంది. భీష్మఏకాదశిని పురస్కరించుకుని.. ఈ నెల 20న గార మండలం శాలిహుండంలో వేణుగోపాలస్వామి యాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రకు జిల్లాతోపాటు విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంతాన వేణుగోపాలస్వామిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. వంశధార నది పక్కన ఎత్తయిన కొండపై వేణుగోపాల స్వామి కొలువై పూజలందుకుంటున్నారు. ఏటా భీష్మఏకాదశి పర్వదినాన జాతర నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేయిస్తారు. యాత్రకు వేలాది మంది భక్తులు తరలిరానుండడంతో శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ మధురెడ్డి తెలిపారు. ఈ ఏడాది అత్యవసర పరిస్థితుల్లో తప్ప.. కొండమీదకు చిన్న చిన్న వాహనాలు అనుమతించబోమన్నారు. సీఐ ఎల్ఎస్.నాయుడు, గార ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఏపీసీపీఎస్ఈఏ గౌరవ అధ్యక్షుడికి నోటీసులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 17: పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఏపీసీపీఎస్ఈఏ.. విజయవాడలో ఈ నెల 18న 'ఓటు ఫర్ ఓపీఎస్' పేరిట ధర్నా నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ఎవరూ వెళ్లకుండా ఉండేలా పోలీసులు ముందస్తు నోటీసులు ఇస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సంతబొమ్మాళిలో ఆ శాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు రెడ్డి సూరిబాబుకు 149 సెక్షన్ కింద నోటీసులు జారీ చేశారు. కాగా కేసులకు భయపడి ఉద్యమాన్ని ఆపేది లేదని.. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సూరిబాబు హెచ్చరించారు.



సూరిబాబుకు నోటీసులు..

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

● గుండెపోటు వల్లే మృతిచెందారని కుటుంబసభ్యుల వెల్లడి

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల రెండో తేదీన హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్యకు బంధువుగా చెప్పుకున్న ప్రధాన రాజేంద్ర (47) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ప్రసాద్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి చీపురుపల్లిలోని తమ భూమిలో అడుగుపెట్టొద్దని, అడుగు పెట్టినట్టయితే చంపేస్తానని బెదిరించారంటూ తహసీల్దార్ హత్య జరిగిన మరుసటిరోజు రాజేంద్ర మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. తనను బెదిరించిన ప్రసాదే తనకు వరుసకు సోదరుడయ్యే తహసీల్దార్ రమణయ్యను హత్య చేసి ఉంటాడని రాజేంద్ర అనుమానం వ్యక్తంచేశారు. అయితే రమణయ్యను హత్య చేసింది మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారం జరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతిచెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంత కాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. కాగా త్రివేణి కథనం ప్రకారం... మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే సీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతి చెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

పాఠశాలను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలి

● విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్


డీఈవోతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

ఇచ్ఛాపురం/కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఆంగ్ల బోధన జరగాలని ప్రతీ పాఠశాల ఒక రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రూరల్ పరిధిలోని లాలాపేట ప్రాథమిక, భవానీపురం పాఠశాలలతోపాటు కవిటి మండలం ఆర్.బెలగాం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆర్‌జేడీ, డీఈవో, డీడీఈవో, ఎంఈవో, ఉపాధ్యాయుల పనితీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల హెచ్‌ఎం ఎన్.విశ్వనాథంతో మాట్లాడుతూ పాఠశాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు లాంగ్వేజ్‌లు తప్ప ప్రతి సబ్జెక్టును ఆంగ్లంలోనే పాఠాలు బోధించాలన్నారు. బైజ్యూస్ క్లాసులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఇన్‌స్ట్రక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అకడమిక్ కేలెండర్ సెల్‌లో చూపించకపోవడంతో ఆర్‌జేడీ, డీఈవో, డిప్యూటీ డీఈవోలపై డిప్యూటీ డీఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారి అయి ఉండి పాఠశాలల నిర్వహణ సక్రమంగా చేయకపోవడం ఏంటీ.. చేయలేకపోతే తప్పుకోండని డీఈవో వెంకటేశ్వరరావును హెచ్చరించారు. అనంతరం లాలాపేట పాఠశాలను సందర్శించి ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయులు తీరు తప్పుపట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిటి మండలం ఆర్.బెలగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థుల చదువుతున్న గదికి వెళ్లి సోషల్ సబ్జెక్టుపై ప్రశ్నలు వేయగా.. వారంతా తెల్లమొహం వేయడంతో సంబంధిత ఉపాధ్యాయుడిపై మండిపడ్డారు. కవిటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉండడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ జ్యోతికుమారి, డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి, ఏపీసీ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి


నిరసన శిబిరంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ఆమదాలవలస: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఏఆర్ఎస్, ఆర్ఎస్‌లు, కేవీకేల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏఆర్ఎస్, ఆర్ఏఆర్ఎస్, కేవీకేల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లేబర్ సమస్యలను పరిష్కరించాలని రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం, పట్టణంలోని ఆచార్య ఎన్జీ రంగా పరిశోధనా స్థానం వద్ద సమ్మె శిబిరాలను శనివారం పరిశీలించారు. సీఐటీయూ తరపున సంపూర్ణమైన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.ప్రకాష్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షురాలు ఎస్.సీతామహాలక్ష్మి, కార్యదర్శి త్రివేణి, కె.కృష్ణవేణి, సుజాత, కొండమ్మ, జ్యోతి ప్రసాద్, శ్రీను, అంబటి యుగంధర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పెన్షనర్ల నిరసన



ర్యాలీలో పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు

ఆమదాలవలస: ఆల్ పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆమదాలవలస పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డీఏ అరియర్స్, పీఆర్సీ అరియర్స్ బకాయిలు లీవ్, జీపీఎఫ్ ఏపీ జీఎల్ఐ, మెడికల్ బిల్స్ రూ.22 వేల కోట్లు బకాయిలు పడినట్టు ప్రభుత్వమే అంగీకరించిందన్నారు. 12వ పీఆర్సీలో 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని ర్యాలీలో నినదించారు. ఈ ర్యాలీలో జేఏసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బొడ్డేపల్లి మోహన్‌రావు, స్థానిక ఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు వై.అప్పలరాజు, ఎన్.రమణమూర్తి, జాయింట్ సెక్రటరీ కె.మనోహర్, పెన్షనర్ల సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, కోశాధికారి హెచ్‌వీ సత్యనారాయణ, నానుపాత్రుని సోదరులు కె.షణ్ముఖరావు, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

శ్రీకాకుళం క్రైం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ప్రాజెక్టులు దోహదపడతాయని ఎంఈవో కృష్ణారావు అన్నారు. రూరల్ మండలం సింగుపురం గ్రామంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్‌డే ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుమారు 100 మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



సోంపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


పొందూరు: డీటీకి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు



నరసన్నపేట: ర్యాలీ చేపడుతున్న ఎన్జీవో సంఘ నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

● ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుల నిరసన

నరసన్నపేట: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని ఎన్జీవో సంఘ జిల్లా కార్యదర్శి చల్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏపీ ఎన్జీవో ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వేణుగోపాలరావు, తాలుకా కార్యదర్శి టి.మోహనరావు, ప్రతినిధులు ఎస్.రవికుమార్, మురళీకృష్ణ, విజయ్‌రాథో, చందన, రమేష్, లక్ష్మణ్, వీఆర్వో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** సమస్యల పరిష్కారానికి ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) పిలుపు మేరకు స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో సలాన చిరంజీవి, ఏపీఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లుకలాపు రామారావు, బాలరాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి రేగేటి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

● **టెక్కలి:** ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జేఏసీ నాయకులు అన్నారు. దీనికి వ్యతిరేకంగా శనివారం ధర్నా నిర్వహించారు. మూడు రోజులుగా నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించ లేదన్నారు. వైసీపీ నాయకుడు చింతాడ గణపతిరావు ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

● **పలాస రూరల్:** ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేయక తప్పదని ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బొనెల గోపాల్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీఆర్సీ అమలు చేయాల్సి ఉండగా అన్యాయం జరిగిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులేషన్ చేపట్టాలని, జీపీఎఫ్, పీఎఫ్ సరెండర్ లీవ్, డీఏలు, ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి రామారావు, ఎన్జీవో సంఘం సెక్రటరీ ఉపేంద్ర, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **పొందూరు:** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన వేలాదికోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ జేఏసీ ఉపాధ్యాయసంఘ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ నాయకుల పిలుపుమేరకు శనివారం జేఏసీ ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు పాత తాలూకా కేంద్రం పొందూరు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.మదన్‌మోహన్, యూటీఎఫ్ పూర్వ జిల్లా అధ్యక్షుడు పొందూరు అప్పారావు ఉపాధ్యాయసంఘ నాయకులు కె.విజయ్ కుమార్, రోజా, బస్వా సతీష్, ఎస్.సత్తిరాజు, రఘువు నాయుడు, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **సోంపేట:** ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందంటూ శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, కె.నారాయణ, బి.రవికుమార్, ఎ.లక్ష్మణరావు ఉన్నారు.



పలాసరూరల్: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో..


టెక్కలి: ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు


పాతపట్నం: ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ దగా

● మంత్రి ధర్మాన నివాసం ముట్టడికి యూత్ కాంగ్రెస్ నేతల యత్నం


యూత్ కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అరసవల్లి: మెగా డీఎస్సీ ప్రకటిస్తామంటూ, దగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కోజు రామారావు అన్నారు. శనివారం పెద్దపాడు రోడ్డులో గల మంత్రి ధర్మాన ప్రసాదరావు నివాసాన్ని యువజన కాంగ్రెస్ నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము న్యాయం చేయాలని అడిగితే దాడులు చేయిస్తున్నారని, దీనిని ప్రజలంతా గమనించాలని కోరారు. ప్రజలకు మంచి పరిపాలన అందించడంలో, నిరుద్యోగ నిర్మూలనలో, విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాగా పోలీసులకు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, జిల్లా అధ్యక్షుడు రెల్ల సురేష్, బి.రామ్‌సింగ్ తదితరులు పోలీసులు అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో నిర్బంధించిన వారిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణరావు, చంద్రశేఖర్ అజాద్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డున పడేసిందని, వారంతా రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. తక్షణమే యువజన కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని, డిఎస్సీ పోస్టులను పెంచి ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

చేనేత సంఘాల సమస్యలు పరిష్కరిస్తాం

● ఆప్కో ఎండీ పావనమూర్తి


వడుకు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆప్కో ఎండీ పావనమూర్తి

పొందూరు: రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల్లో పేరు కుపోయిన సరుకులు కొనుగోలు చేయడం, సంఘాలకు పేరుకుపోయిన బకాయిలను చెల్లించడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆప్కో ఎండీ ఆర్.పావన మూర్తి తెలిపారు. మండల కేంద్రంలో సాయిబాబా చేనేత సహకార సంఘాన్ని ఏఎఫ్‌కేకే సంఘాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. గతేడాది డిసెంబరు వరకు చేనేత సహకార సంఘాలకు ఉన్న బకాయిలు చెల్లించినట్టు తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులకు సరిపడ్డ స్కూల్ యూనిఫారాలు ఉత్పత్తి చేయడానికి తగినంతమంది కార్మికులు లేరని, స్కూల్ యూనిఫారాలు తయారుచేసే నేత కార్మికులు కేవలం కడపలోనే ఉన్నా రన్నారు. అందుకే ప్రభుత్వం యూనిఫారం క్లాత్‌ను ఇతర మార్గాల్లో కొనుగోలు చేస్తోందన్నారు. దుప్పట్లు, తువ్వాళ్లు ఇతర వస్త్రాలను ప్రభుత్వం ఆప్కో నుంచి మాత్రమే కొనుగోలు చేస్తోందన్నారు. పొందూరు చేనేత సంఘం ద్వారా గోరంచు పంచెలు కొనుగోలుకు ఆప్కో సిద్ధంగా ఉన్నా ఇక్కడ గోరంచె పంచెలు అందించే పరిస్థితి లేదన్నారు. ఏఎఫ్‌కేకే సంఘాన్ని పరిశీలించి ఖాదీవస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీ లించారు. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఖాదీ కార్మికులకు మరింత ఎక్కువ పనిని కల్పించగలమని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరప్రసాద్, దండా వెంకట రమణ తెలిపారు. ఆప్కో ఎండీతో పాటు చేనేత జౌళ్లశాఖ ఏడీ ధర్మారావు, చేనేత సంఘం మేనేజర్ వట్టం శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

కూర్మనాథుడి సన్నిధిలో మాజీ ఉప రాష్ట్రపతి సతీమణి


పూజల్లో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి భార్య ఉషానాయుడు, బీఎస్ఎన్ఎల్ చీఫ్ శేషాచలం శర్మ దంపతులు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుడి స్వామిని శనివారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషానాయుడు దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆలయ ప్రధాన అర్చకులు సీతారామనర్సింహాచార్యులు, ఇతర అర్చకులు ఆశీర్వచనం అందచేశారు. స్వామివారి చిత్ర పటాన్ని ప్రసాదాన్ని ఆలయ ఉద్యోగి నరసుబాబు వారికి అందచేశారు. అలాగే బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం శర్మ దంపతులు దర్శించుకున్నారు. వీరికి స్వామి వారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు వారికి అందచేశారు.

ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి


బిల్డింగ్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం క్రైం: ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి చేపట్టేందుకు కమిషనర్ తమీమ్ అన్సారియా చర్యలు చేపట్టారు. నగరాభివృద్ధిలో భాగంగా శనివారం నగరంలో పలుచోట్ల కమిషనర్ పర్యటించారు. స్థానిక శాంతినగర్ కాలనీలో ఉన్న రివర్‌వ్యూ పార్క్, కృష్ణాపార్క్‌లను కమిషనర్ సందర్శించారు. అలాగే ప్లానింగ్‌లకు అప్లికేషన్ పెట్టుకున్న బిల్డింగ్‌లను, ఈట్ స్ట్రీట్‌లో చేడుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ పర్యటనలో కమిషనర్‌తో పాటు టీపీవో ఉమామహేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగంకావాలి


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: యాంత్రిక జీవన విధానంలో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులు ఉన్నాయని, ముఖ్యంగా విద్యార్థుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని యోగా శిక్షకులు రమేష్‌సాహు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా యోగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్‌సాహు, అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్, రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

'ప్రజాపోరు' విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సూరపునాయుడు

ఆమదాలవలస: ప్రజాపోరు విజయవంతం చేయాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు ప్రజాపోరు చేపడుతున్నట్టు చెప్పారు. అలాగే బీజేపీ ప్రవేశపెట్టిన అనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికి సిద్ధమైంది. దీనిని నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి చేరడానికి బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు. ఈ కార్య క్రమంలో మండల అధ్యక్షుడు చింతాడ అప్పారావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు చింతాడ అప్పారావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు వేల్పుల గోవిందరావు, బూర్జ ప్రధాన కార్యదర్శి గుంటి రాము, సంపతిరావు రామారావు పాల్గొన్నారు.

బీల ఉద్యమంపై పుస్తకం విడుదల

సోంపేట: థర్మల్‌ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా సోంపేటలో జరిగిన ఉద్యమానికి సంబంధించి రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎ.అజయ్‌శర్మ పుస్తకాన్ని రాశారు. దీనిని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌శర్మ మాట్లాడుతూ.. ప్రపంచ ఉద్యమాల్లో సోంపేట ఉద్యమం ఓ ప్రత్యేకత చాటుకుందన్నారు. ఈ ఉద్యమం నుంచి ప్రపంచం పర్యావరణంపై పాఠాలు నేర్చుకుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఖగేశ్వరరావు, గోపాలరావు, మోహనరావు, బార్ల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నిఘా బృందాలు పారదర్శకంగా పనిచేయాలి

కలెక్టరేట్: రానున్న ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే నిఘా బృందాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. వివిధ నిఘా బృందాలు, పలు శాఖల ఉన్నతాధికారులతో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదేలపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా తనిఖీల సమయంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వ్యవహరించాలని, నగదు జప్తు చేసే సమయంలో పంచనామా నిర్వహించి, రశీదులను ఇవ్వాలన్నారు. త్వరలోనే జిల్లాస్థాయి కమిటీని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, ఏఎస్పీ ప్రేమ్ కాజల్, డీఆర్వో ఎం.గణపతిరావు, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో నూతన కోర్సులు

శ్రీకాకుళం అర్బన్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇంటర్ మీడియట్ పాసైన అభ్యర్థులు అర్హులని చెప్పారు. 18 నుంచి 28 ఏళ్లలో వయసు ఉన్నవారే అర్హులన్నారు. ముందుగా మూడు మాసాలు శిక్షణ ఇచ్చాక అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఆయన వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు 76809 45357, 91219 99654 ఫోన్ నెంబర్లలో గాని, రాగోలు జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని క్యాంపస్‌లో సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

అరసవల్లి: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో శిక్షణ పొందిన కళా బృందాలతో ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారి తెలిపారు. దీనికి సంబంధించి శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో కళాబృందాల ప్రదర్శనను డాక్టర్ సీపీ శ్రీదేవి జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, పీఎంవో సాంబమూర్తి, అప్పారావు, అరుణ, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాగభూషణం, రామ్‌ప్రసాద్, శ్రీదేవి, లక్ష్మణరావు, మల్లేశ్వరరావు, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు


కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆనందోబ్రహ్మ స్పిరిట్యువల్ సంస్థ, పీఎస్ఎన్ఎం సంస్థ ఆధ్వర్యంలో కల్లేపల్లిలోని సంప్రదాయం కూచిపూడి గురుకులం భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి సంగీత విద్య విద్యాపీఠం సుసరాపు లక్ష్మీగణపతి శర్మ ఆధ్వర్యంలో శిష్య బృందంచే త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపించారు. అదేవిధంగా పంచరత్న కీర్తనలు, కూచిపూడి నృత్యాలు చేపట్టారు.

అమ్మవారికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: మొండేటి వీధిలో వెలసి ఉన్న షిర్డీసాయి ఆలయంలో లలితా సహిత శివకామేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా లలితా దేవి అమ్మవారికి రాజశ్యామల అమ్మవారిని విశ్వరూపంలో దర్శనం కల్పించారు. భక్తులు లలితా దేవి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంతోషిమాతకు పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో వెలసిన సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో మాఘశుద్ధ సప్తమి సందర్భంగా శనివారం తెల్లవారు జామున సుప్రభాత సేవ, మహాన్యాస పూర్వక నమక చమక పంచ సూక్తములతో క్షీరాభిషేకం, సుగంధ పరిమళ శోభిత పుష్పాలచే అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

టీడీపీతోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి

- ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- శిరీష సమక్షంలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

హరిపురం: టీడీపీతోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మో హన్ నాయుడు అన్నారు. బొగాబంద గ్రామంలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి టీడీపీ ఐటీడీఏను ఏర్పాటు చేస్తే వైసీపీ ప్రభుత్వం జిల్లాలో ఐటీడీఏ లేకుండా చేసిందని విమర్శించారు. ఐదేళ్లలో కనీసం అభివృద్ధికి నోచుకోకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మళ్లించి గిరిపుత్రులకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, రిజర్వాయర్‌ల మరమ్మతులు చేపట్టి టీడీపీ రైతులకు అండగా నిలుస్తుందన్నారు.


హరిపురం: పార్టీలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్, శిరీష

వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

బొగాబంద, కిల్లోయి, కుమ్మరికుటియా, కుడుమాసాయి, సియాటుట్టి, కొంటాసాయి గ్రామా లకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతు శిరీషా ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి ఎంపీతో కలిసి ఆమె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి సవర రాజు, వార్డు సభ్యుడు బర్రు గోపాలరావు, రత్నా వరప్రసాద్, బేసి లక్ష్మి, జన్ని అమ్మాయి, గోల మన్మథ రావు, రాజేష్, కొయ్యపు కామేశ్వరరావు, రాకేష్, గోవిందస్వామి, పుణ్యావతి, కాంతారావు, శివ, శ్యామ్, వసంత్ కుమార్, నీలకంఠం, సోమేష్‌తోపాటు 50 కుటుంబాల వారున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైసీపీని గెలిపిస్తే మంత్రి అప్పలరాజు గిరిజన ప్రాంతాల అభివృద్ధిని విస్మరించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి గౌతు శిరీషాను ఎమ్మెల్యేగా గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, నేతలు రట్టి లింగరాజు, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, మహేష్, డోల తిరుపతిరావు, చంద్రశేఖర్, కర్రయ్య, సవర శంకర్, లఖియా, మంగళపాత్రో పాల్గొన్నారు.

రాజధానుల పేరుతో జగన్‌రెడ్డి దోపిడీ: అశోక్

కవిటి: రాష్ట్రంలో రాజధానుల పేరుతో జగన్‌రెడ్డి నిలువు దోపిడికి పాల్పడ్డారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మూడు రాజధానులని చెప్పి మోసగించి పక్క రాష్ట్రానికి రాజధాని కావాలని అడుక్కునే స్థాయికి ఏపీని దిగజార్చారన్నారు. ఈ ఐదేళ్లలో దాచుకోవడం, దాచుకోవడం తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రాజధాని ఫైల్స్ సినిమాతో ఆయనకు భయం పట్టుకుందన్నారు. ప్రాంతాల పేరుతో ప్రజలను విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న జగన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నేతలు బి.రమేష్, వి.రంగారావు, మణిబాబు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

టీడీపీతోనే మత్స్యకారుల అభ్యున్నతి

సంతబొమ్మాళి: టీడీపీ ప్రభుత్వంతోనే మత్స్యకారులకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. శనివారం మేఘవరం పంచాయతీలో పల్లె పల్లెకు టీడీపీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పరపటి రాజశేఖర్, వజ్జ ప్రభాకర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, మండల ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, కూశెట్టి కాంతారావు, కర్రి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందిస్తున్న నేతలు

బాబుతోనే భవిష్యత్‌కు గ్యారెంటీ


కరపత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్‌కు గ్యారెంటీ అని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం సారవకోట మండలం గొటివాడ, మహమ్మద్‌పురం, గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సారవకోట మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రాము, మొయ్యి శ్రీను, మెండ సింహాచలం పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపాలి

టెక్కలి: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలకు ఒరిగిందేమీ లేదని, రానున్న ఎన్ని కల్లో సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ అన్నారు. శనివారం కోట బొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం, వింజాంపాడు తదితర గ్రామాల్లో పల్లె పల్లెకు టీడీపీని నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో నాయకులు పూజారి శైలజ, వాన లక్ష్మి, దేవాది సింహాద్రి, బెండి అన్నపూర్ణ, నర్సింగ రావు, నంబాళ్ల శ్రీనివాస్, ఉప్పాడ జయరాం, దుంపల నర్సింహమూర్తి, పట్ట సింహాచలం, కోట నాగేశ్వరరావు, శిమ్మ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను అందించి పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ ఆరు సూత్రాలపై అవగాహన

రణస్థలం: వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి కోష్ట పంచాయతీ పిసిని గ్రామంలో టీడీపీ ఆరు సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రణస్థలం: సూపర్ సిక్స్‌పై వివరిస్తున్న కళా వెంకటరావు

టీడీపీని గెలిపించండి

బూర్జ: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు దుర్గారావు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం పెద్దపేట పంచాయతీ సీలాపురం గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ చేసిన టేబుల్ క్యాలెండర్ అందించారు.


బూర్జ: కరపత్రం అందిస్తున్న దృశ్యం

కుంకుమ చెరువు పరిశీలన

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పెంటిభద్ర గ్రామానికి ఆనుకొని ఉన్న కుంకుమ సాగరంలో అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతుండడంతో ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. కుంకుమ సాగరంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతుండడంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'అంతా మా ఇష్టం' శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో తహసీల్దార్ ఎస్‌వీవీఎస్ నాయుడు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యం

నరసన్నపేట: పేదలకు క్షేత్ర స్థాయిలో వైద్యసేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆసుపత్రిలో మాతాశిశు సంరక్షణ కేంద్రం భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఏపీఎంఐడీసీ ఈఈ సత్యప్రభాకరరావు, డీఈఈ శిమ్మన్న, ఎంపీపీ ఆరంగి మురళీ పాల్గొన్నారు. భవన నిర్మాణాలు పూర్తి కాకుండా ప్రారంభించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

గ్రానైట్ లీజు రద్దు చేసేలా కృషి చేయండి

- లోకేశ్‌ను కోరిన టీడీపీ నేతలు

మెళియాపుట్టి: మర్రిపాడు-సి పంచాయతీ జలగ లింగుపురం గ్రామ సమీపంలో ఉన్న ఇంజాద్రి కొండలో గ్రానైట్ లీజులు రద్దు చేసేలా కృషి చేయాలని సర్పంచ్ అనురాధ, సర్పంచ్ ప్రతినిధి గణపతి తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం విజయనగరంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఇంజాద్రి కొండపై అమ్మ వారికి పూజలు చేయడం అనాదిగా జరుగుతోందని, అయితే వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు కొండను లీజుకు ఇచ్చారన్నారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రానైట్ లీజులను రద్దు చేసేలా చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. అలాగే దీనబంధుపురం, వెంకటాపురం, మర్రి పాడు పంచాయతీల్లో సాగు నీరందించేందుకు ఎత్తిపోతలు పథకం ఏర్పాటు చేయాలని వారు కోరారు.



ఎంఐజీ లేఅవుట్లపై అవగాహన కలిగించండి

పలాస: ఎంఐజీ లేఅవుట్లపై ఉద్యోగులు, వార్డు ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని సుడా వైస్‌చైర్మన్ సీహెచ్ ఓబులేసు అన్నారు. పలాస- కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి చైర్మన్ బల్ల గిరిబాబుతో మాట్లాడారు. పబ్లిక్‌హెల్త్ ఈఈ సుగుణాకర్, టిడ్కో ఈఈ రమణమూర్తి, కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

టెక్కలి: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (ఏటీఎల్) అకాడమీ సహకారంతో ఈనెల 12న ప్రారంభమైన అధ్యాపకుల శిక్షణ శనివారంతో ముగిసినట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌డీపీలో భాగంగా నిర్మాణంలో ఉన్న మూలపేట ఫిషింగ్ హార్బర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముగింపు సభకు నాగపూర్ వీఎన్ఐటీ ప్రొఫెసర్ అవినాష్ కేస్కర్ హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, డీన్ డి.ఆజాద్, అసోసియేట్ డీన్ ఎం.జయమన్మథరావు, ఈసీఈ హెచ్‌వోడీ, ఎఫ్‌డీపీ కో-ఆర్డినేటర్‌గా బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రోడ్డెప్పుడు?

- ఆమోదించి రెండున్నరేళ్లవుతున్నా చేపట్టని పనులు
- ఇదీ మునిసిపల్ చైర్మన్ వార్డులో తీరు..
- మంత్రి ఒత్తిళ్లతోనే జాప్యం?

(పలాస)

పట్టణాభివృద్ధి అంతా ఆయన చేతుల్లోనే ఉంటుంది.. ఏ వార్డులో ఏ పని చేయాలన్నా మునిసిపల్ సమావేశంలో తీర్మానించి పనులు చేయించాల్సి ఉంటుంది.. అయితే రాజకీయ ఒత్తిడి కారణంగా ఆయన సొంత వార్డులోని శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం చేపట్టలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఆరో వార్డు పెసర పాడులో శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి రెండున్నరేళ్ల కిందట పరిపాలనామోదం తీసుకున్నారు. టెండరు దశలో దాటకపోవడంతో నేటికీ ఆ పనులు చేపట్టకపో వడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన గిరిబాబుకు ఈ రోడ్డుకు కంకర వేసి ఆ తరువాత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. దీంతో వారి అభ్యర్థన మేరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు చేస్తూ తీర్మానించారు. అయితే ఈ పనులు చేపట్టకుండా నేటికీ టెండర్ దశలోనే ఉండడంతో ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది. సాక్షాత్తు చైర్మన్ కలుగజేసుకున్నా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పనుల్లో పురోగతి కనిపించలేదు. దీంతో గ్రామం నుంచి సుమారు కిలోమీటరు మేర చెరువు గట్టుపై నుంచి శ్మశానానికి వెళ్లాల్సి వస్తోందని, ఇబ్బందులు ఎదురవు తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై చైర్మన్ గిరిబాబును వివరణ కోరగా ప్రస్తుతం పనులకు సంబంధించి టెండరు దశలో ఉందని, త్వరలో పనులు చేపడతామన్నారు.


పెసరపాడు శ్మశానానికి వెళ్లేందుకు వేసిన కచ్చా రహదారి

శ్మశానం రోడ్డుకు రాజకీయాలేంటి?

తనతో పాటు గ్రామస్థుల వినతి మేరకు శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తీర్మానించారు. కేవలం మంత్రి ఒత్తిడి మేరకు రాజకీయకక్షతో పనులు కాకుండా నిరోధించారు. చైర్మన్ వార్డులోనే పనులు ఈ విధంగా ఉంటే మిగిలిన వార్డుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో వైసీపీ అభ్యర్థుల విజయం కోసం శ్రమిస్తే ఇచ్చిన బహుమతి ఇదా? అధికారులు రాజకీయ వత్తిళ్లకు తలొగ్గడం సరికాదు.



-సంపతిరావు ధనుంజయ్,
మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకుడు

దుర్గంధం స్వర్గధామం

టెక్కలి: టెక్కలి ఇందిరాగాంధీ కూడలి సమీపంలో ఉన్న స్వర్గధామంలో దుర్గంధం వెద జల్లుతోంది. దీంతో దహన సంస్కారాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశాన వాటిక ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, పారిశుధ్య లోపం కనిపిస్తోంది. మందు బాబులకు అడ్డాగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శ్మశాన వాటికలో పారిశుధ్య పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


అపరిశుభ్రంగా ఉన్న స్వర్గధామం

జిల్లాస్థాయి కబడ్డీ విజేత జట్టుకు అభినందన


జిల్లాస్థాయి విజేత జట్టుతో ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల పోటీల్లో బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచినట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యా యులు తిరుపతిరావు, సాయి శివానీలను శనివారం సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాడాన రాజు, లోకేశ్వర రావు, వెంకటరెడ్డి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో పెద్దసీదికి ద్వితీయం


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాతపట్నం: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీల్లో పెద్దసీది జడ్పీహైస్కూల్ విద్యార్థులు ధనుష్ గౌతమ్ ద్వితీయ స్థానం పొందినట్లు హెచ్‌ఎం బి.రామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పాఠశాల కార్యదర్శి రేగేటి మధుసూదన రావు, ఆంగ్లోపాధ్యాయుడు కొల్లి లక్ష్మీనారాయణ, పీడీ కృష్ణారావు తదితరులు అభినందించారు.

'ఉపాధి' పని దినాలు 80 శాతం ఉండాలి

- డ్వామా పీడీ చిట్టిరాజు

నందిగాం, ఫిబ్రవరి 17: ప్రతి పంచాయతీలో ఉపాధి పని దినాలు 75 నుంచి 80 శాతం ఉండాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ చిట్టిరాజు అన్నారు. శనివారం నందిగాం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. పంచాయతీల వారీగా డీఆర్పీలు చేపట్టిన తనిఖీ వివరాలను సభలో ప్రకటించారు. పనుల్లో లోపాలు లేకుండా టెక్నికల్ అసిస్టెంట్లు చూడాలన్నారు. ప్రతి ఫీల్డ్‌అసిస్టెంట్ నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలన్నారు. మండలంలో 3,500 కుటుంబాలకు వందరోజులు పని కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, ఏపీడీలు బి.మురళీకృష్ణ, శైలజ, లోకేష్, క్వాలిటీ ఈసీ గోవిందరావు, ఎస్పార్పీ దాసు, ఏపీవో ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

బీజేడీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా పాణిగ్రాహి

ఒడిశా

పర్లాకిమిడి: బిజూ జనతాదళ్ (బీజేడీ) రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా హైటెక్ విద్యాసంస్థల డైరెక్టర్ రూపేష్ పాణిగ్రాహి ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణబ్ ప్రకాష్ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొంత కాలంగా పార్టీ అభివృద్ధికి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిన రూపేష్ పాణిగ్రాహిని రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా నియమించడంపై ఎంపీ చంద్రశేఖర్ సాహు, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, తిరుపతి పాణిగ్రాహి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై సీఎం నవీన్ పట్నాయక్ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.



బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని ఈఆర్వో రామ్మోహన్‌రావు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. డబుల్ ఎంట్రీలు, మృతిచెందిన వారి ఓట్లు, శాశ్వతంగా వలసలు వెళ్లిన వారి ఓట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా విధులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వోలు కనకారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

పోలాకి: ఆరో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఎంఈవో టి.లింగరాజు సూచించారు. శనివారం పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న లిప్ (లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) శిక్షణను పరిశీలించారు. ఆంగ్లం, గణితం, సైన్స్ పాఠ్యాంశాలపై విద్యార్థులతో డెమో నిర్వహించారు. బోధనా పద్ధతులను అవలంబించాలని, లెసన్‌ప్లాన్‌లను సిద్ధం చేసుకుని తరగతి లోకి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజపంతుల లక్ష్మి, ఉన్నత పాఠశాలల ఆంగ్ల, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు రేపు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం జిల్లా హ్యాండ్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో ఈనెల 23 నుంచి 25 వరకు 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. 16 ఏళ్లు నిండిన క్రీడాకారులు పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 85000 07272 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి విగ్రహాల పునః ప్రతిష్ఠోత్సవం

పలాసరూరల్: కాశీబుగ్గ పూజారి వీధిలో వెలసిన రాధాకాంత స్వామి ఆలయం పునః ప్రారంభం, రాతి విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణపతి, దశావతార, జయవిజయ, గరుత్మంతుల నూతన రాతి విగ్రహాలతో పాటు మరికొన్ని పౌరాణిక విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామన్నారు. యాగశాల ప్రవేశం, అగ్ని ఆవాహన, అఖండ దీపారాధన నిర్వహిస్తున్నామన్నారు.

కుట్ర బయటపడింది

- టీడీపీ కేడర్‌ను భయపెట్టాం.. రౌడీయిజం చేశాం...
- అచ్చెన్నాయుడిని జైలులో పెట్టించగలిగా
- తెలుగుదేశం వారిని బయటకు రానీయలేదు
- వైసీపీ గెలిచేందుకే ఇలా చేశా...
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆడియో వైరల్..

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం/టెక్కలి, ఫిబ్రవరి 17: అధికార పార్టీ దర్పం.. అధికారం మదంతో చేసిన కుట్ర బయటపడింది. తాను ఎంతటి ఘనకార్యం చేశానన్నదో.. సొంత పార్టీనేతల వద్దనే బయటపెట్టుకోగా.. అదే ఇప్పుడు ఆడియోగా వైరల్ అవుతోంది. ఇంతకూ అసలు విషయానికొద్దాం. టెక్కలి వైసీపీ నాయకుడు.. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దుందుడుకు స్వభావం తెలిసిన విషయమే. తాజాగా తాను మాట్లాడిన ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ.. ఇటు వైసీపీ, టీడీపీ నాయకులు, ప్రజల సెల్‌ఫోన్లలోనూ సంచలన మైంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడిని, తెలుగుదేశం పార్టీ కేడర్‌ను తాను ఎలా ఇబ్బందులు పెట్టానో అన్నది ఆడియోలో స్పష్టమైంది.

ఆడియోలో.. ఎమ్మెల్సీ దువ్వాడ సంభాషణ ఇదీ...

'సంతబొమ్మాళి టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి పుక్కళ్ల శ్రీనివాసరావును గట్టిగా హెచ్చరించా. బయటకు వస్తే అంతు చూస్తా అని హెచ్చరికతో పాటుగా అతనిపై రౌడీషీట్ కూడా తెరిపించి అరెస్ట్ చేయించాం. ఇక కోటబొమ్మాళి జడ్పీటీసీ అభ్యర్థి పూజారి శైలజ భర్త సత్యంను ఇంటిలోనే తలుపులు వేయించి బంధించగలిగాం. అదే రీతిన నందిగాం, టెక్కలి జడ్పీటీసీ అభ్యర్థులను కూడా బయటకు రానీయకుండా చేశాం. తెలుగుదేశం కేడర్ ఎవరినీ బయటకు రానీయకుండా చేయగలిగా. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలా చేయడంతోనే టెక్కలి నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలను, 119 పంచాయతీలను గెలిపించుకోగలిగాం. లేకుంటే అన్ని స్థానాలు వైసీపీకి రావు. కేవలం 55 సర్పంచ్ స్థానాలు మాత్రమే వైసీపీకి చెందినవారు గెలుస్తారని ముందుగా తెలిసింది. మిగిలినవి టీడీపీ గెలిచే అవకాశముందని వెల్లడైంది. అప్పుడు ఏం చేయాలన్నదీ ఆలోచించి.. ఇదంతా చేశా. అచ్చెన్నాయుడు సొంతూరు నిమ్మాడలో వైసీపీకి మద్దతుగా ఉన్న కింజరాపు అప్పన్నతో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయకుండా టీడీపీ వాళ్లు ఇబ్బంది పెట్టారు. దీంతో ఇదే అవకాశంగా ఆ ఊరిపైనే నేను దాడి చేసి.. అప్పన్నతో నామినేషన్ వేయించా. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు దాడి చేశారని చెప్పించి అతన్ని జైల్లో వేయించా. తెలుగుదేశం వారిని భయపెట్టగలిగి రౌడీయిజం చేశాం'